



బుర్రకథ..ఊపిరిగా..



మిరియాల అప్పారావు.. మొన్నటి వరకూ ఒక బుర్రకథ కళాకారుడు మాత్రమే.. ఆయన కళ కోసం ఎంత పరితపించారనేది సమాజానికి తెలియని వాస్తవం..ఆ వాస్తవంలోకి వెళ్లి చూస్తే ఆకలి.. కష్టాలు.. కన్నీళ్లు.. బాధలు.. బాధ్యతలు.. అయినా ఆయన మాత్రం కళను వదల్లేదు.. చివరి వరకూ కళనే ఊపిరిగా చేసుకుని జీవించారు.. ఎంతో మంది ఆ కళతో ఏం సాధించా వన్నా చిరునవ్వే సమాధానం.. బుర్రకథకు ఆదరణ తగ్గినా తుది వరకూ అదే ఊపిరిగా బతికారు.. ఈ నెల 15వ తేదీన కళామతల్లి ఒడిలోనే ఒరిగిపోయారు..ఆయన లేకున్నా.. కష్టం ఎక్కడికి పోతుంది.. అందుకే కేంద్రం అందించే ఎంతో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దశదినకర్మ రోజునే వెతుక్కుంటూ వచ్చింది.. మళ్లీ మిరి యాల బుర్రకథకు ఊపిరులూదింది..! - వివరాలు 6లో



మేజర్ డ్రెయిన్ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లో

పూడికతీత చేపట్టాలి

కలెక్టర్‌ను కోరిన రైతులు, ప్రజాప్రతినిధులు

అమలాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు పూర్తిస్థాయిలో డ్రెడ్జింగ్ పనులు చేపడితే మురుగునీరు నేరుగా కేశవదాసుపాలెం వద్ద సముద్రంలో కలిసే అవకాశం ఉందని స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పరంగా పూడికతీత పనులు చేపట్టాలని స్థానిక రైతులు కలెక్టర్‌ను ముక్తకంఠంతో కోరారు. శంకరగుప్తం ప్రధాన మురుగుకాల్వ కారణంగా దెబ్బతిన్న కొబ్బరిచెట్లను గురువారం అధికారులతో కలిసి కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్వాపరాలు, స్థితిగతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.శంకరగుప్తం మురుగుకాల్వ కరవాక నుంచి కేశవదాసుపాలెం వరకు ఉందని, ఈ మేజర్ డ్రెయిన్‌కు సంబంధించి 2017-18లో సగభాగం మాత్రమే తూర్పుపాలెం వరకు పూడికతీత డ్రెడ్జింగ్ పనులు చేపట్టారని వివరించారు. మిగతా సగం పనులు చేపట్టకపోవడం వల్ల గట్లు మీదుగా మురుగునీరు పారుతుందని వివరించారు. కొబ్బరిచెట్లకు మురుగునీరు చేరడంతో పాటు సముద్రపు ఆటుపోట్లు మూలంగా ఉప్పునీరు తోటల్లోకి, పొలాల్లోకి చేరడం మూలంగా కొబ్బరి చెట్లు చనిపోతున్నాయని వివరించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్వీ కిశోర్, దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో అత్యున్నత ఫలితాలకు 'ప్రేరణ'

జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రేరణ తరగతులు నిర్వహించాలని డీఈవో షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ముమ్మిడివరం శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక విద్య ప్రేరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం ప్రారంభమవుతుందన్నారు. 500 మార్కులకు పైగా సాధించిన ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపడమే ప్రత్యేక ప్రేరణ తరగతుల ఉద్దేశమన్నారు. విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇస్తామని, 600 కు 600 మార్కులు సాధించేలా అవసరమైన మోటివేషన్ తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతీ సబ్జెక్టులో ఉత్తమ మార్కులు పొందేలా నిపుణుల చేత మార్గదర్శనం చేయించనున్నట్లు చెప్పారు. 520 మార్కులు పైగా సాధించిన విద్యార్థులను మండలాల వారీగా ఒకచోట సమీకరించడం, విద్యార్థుల రవాణా కోసం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన వాహనాలు ఏర్పాటు చేయడం లాంటి చర్యలు తీసుకుంటామన్నారు. మండల నోడల్ హెచ్ఎం, సీనియర్ హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు శిక్షణకు హాజరయ్యేలా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి హాజరుకాని ఏదైనా పాఠశాల ఉంటే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల వివరాలను మండల విద్యాశాఖాధికారి నోడల్ హెచ్ఎంతో చర్చించి గ్రూపులో అందించాలన్నారు. పూర్తి శ్రద్ధతో శిక్షణ తీసుకుని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులను శిక్షణ కార్యక్రమానికి సురక్షితంగా తరలించే బాధ్యత మండల విద్యాశాఖ అధికారులపై ఉంటుందన్నారు. సమావేశంలో ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ పి.హనుమంతరావు ఉన్నారు.

'అంతర్వేది' కల్యాణోత్సవాలపై కలెక్టర్ సమీక్ష

వార్త..7లో



'పన్ను' లోటు!

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలు
- కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో రూ.173 కోట్ల పెండింగ్
- ఏళ్ల తరబడి వసూళ్లకు నానా తిప్పలు పడుతున్న అధికారులు.. టార్గెట్లతో కుస్తీ
- అత్యధిక బకాయిలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు దుకాణాలు, ఖాళీస్థలాలవే
- అత్యధికంగా కాకినాడ, రాజమహేంద్రి కార్పొరేషన్లలో సగానికిపైనే బకాయిలు
- అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65కోట్లకుగాను రూ.8.95 కోట్ల బాకీలు
- రూ.173కోట్ల బాకీలో రూ.80కోట్ల వరకు వసూలు అసాధ్యమన్న అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆస్తి పన్ను బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఏళ్లకు ఏళ్ల వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నా మొండిబాకీలు కదలనంటున్నాయి. ఒకపక్క ఇంటి పన్నులు ఎంతో కొంత వసూలవుతున్నా ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు, ఖాళీ స్థలాల పన్నులు మాత్రం ఎక్కడివక్కడే అన్నట్టు కదలడం లేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆస్తి పన్ను బకాయిలు రూ.173కోట్ల వరకు పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు గత కొన్నేళ్ల బకాయిలు సైతం కలిపి ఈ స్థాయిలో పేరుకుపోయాయి. అత్యధికంగా కాకినాడ జిల్లాలో రూ.80.17 కోట్లు, తూ.గో.లో రూ.74.80కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.18.76 కోట్లు బాకీలు ఉన్నాయి. ఈ మొత్తం బాకీల్లో అత్యధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, ఖాళీ స్థలాలే ఉన్నాయి. ఎంత ప్రయత్నిస్తున్నా మొండిబాకీలు కదలడం లేదు. ఇందులో కొన్ని సంస్థలు, కంపెనీలవైతే ఏకంగా పదేళ్లకుమించే బాకీలున్నాయి. దీంతో ఈ బకాయిలను ఏంచేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కదలితేగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏటా ప్రతి ఇంటి యజమాని నుంచి ప్రైవేటు వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీస్థలం యజమానులు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఆస్తిపన్ను చెల్లించాలి. లేదంటే మున్సిపల్ పరిపాలనశాఖ అపరాధ రుసుం సైతం వసూలు చేస్తుంది. మరోపక్క పన్ను వసూళ్లకు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ప్రత్యేక రెవెన్యూ విభాగం ద్వారా ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేస్తాయి. అటు ఆన్‌లైన్‌లోను చెల్లింపులు జరపొచ్చు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం ఆస్తి పన్నుల వసూలు పెద్దగా జరగడం లేదు. ప్రతి ఏటా బాకీలు భారీగా పెరిగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పన్నుల వసూళ్లు చేస్తున్నా కేవలం గృహ సంబంధిత పన్నులే ఎక్కువగా వసూలవుతున్నాయి. ప్రైవేటు సంస్థలు, కంపెనీలు, పరిశ్రమల నుంచి అసలు బాకీలు కదలడం లేదు. అటు ఖాళీ స్థలాల యజమానులు సైతం బకాయిలు చెల్లించడం లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలైతే బడ్జెట్ లేక ఏళ్ల తరబడి పన్నులు కట్టడం లేదు. దీంతో ఇవన్నీ కలిపి కోట్లలో పేరుకుపోతున్నాయి. వీటిని ఎలా వసూలు చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి ఆస్తి పన్నుల బకాయిలు రూ.132.18కోట్లు వసూలు కావలసి ఉండగా, ఇంతవరకు రూ.52.01కోట్లు వసూలైంది. ఇంకా రూ.80.17కోట్లు రావలసి ఉంది. ఇందులో కాకినాడ కార్పొరేషన్‌కు పాత,కొత్త బకాయిలు కలిపి రూ.100.08 కోట్లు రావలసి ఉండగా, ఇంతవరకు రూ.37.30కోట్లే వసూలైంది. ఇంకా రూ.62.78 కోట్లుపైగా బకాయిలు వసూలు కావలసి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని కోర్టు వివాదాల కారణంగా రూ.100 కోట్లలో రూ.20 కోట్ల వరకు పన్నులు వసూలయ్యే అవకాశం లేదని కమిషనర్ భావన వివరించారు. మిగిలిన రూ.80 కోట్లలో రూ.50 కోట్ల వరకు వసూలైందని తెలిపారు. ప్రధానంగా ఖాళీ స్థలాల పన్ను రూ.28కోట్ల వరకు రావలసి ఉందన్నారు. కానీ బాకీలపరంగా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో కార్పొరేషన్ రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. మరోపక్క తుని మున్సిపాల్టీలో రూ.6.23 కోట్లకుగాను ఇంతవరకు రూ.3.81కోట్లు, పెద్దాపురం రూ.6.05 కోట్లకు రూ.3.22కోట్లు, సామర్లకోట రూ.7.33 కోట్లకు రూ.2.75కోట్లు, పిఠాపురం రూ.8.68 కోట్లకు రూ.2.67కోట్లు, ఏలేశ్వరం నగర పంచాయతీలో రూ.2.35 కోట్లకు రూ.96 లక్షలు, గొల్లప్రోలు రూ.1.47 కోట్లకు రూ.90 లక్షలే వసూలైంది.

తూర్పుగోదావరిలో..

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి రూ.119.46 కోట్ల ఆస్తిపన్ను వసూలవ్వాల్సి ఉంది. కానీ ఇందులో రూ.50.04 కోట్లే వసూలైంది. ఇంకా రూ.69.42 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల నుంచి మాత్రం ఆస్తిపన్నులు వసూలవడం లేదు. అధికారులు ఎన్ని నోటీసులు ఇస్తున్నా వీటి నుంచి స్పందన లేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల నుంచి పన్నులు, కొన్ని న్యాయస్థానం వివాదాలతో కలిపి రూ.23 కోట్ల వరకు పన్నులు వచ్చే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. అటు నిడదవోలు మున్సిపాల్టీలో రూ.7.29 కోట్లకుగాను రూ.3.11 కోట్లే ఆస్తిపన్ను వసూలైంది. కొవ్వూరులో రూ. 3.86 కోట్లకు రూ.2.66కోట్లే వసూలైంది. వెరసి తూర్పుగోదావరి జిల్లాలో రూ.130.61కోట్ల మొ త్తం ఆస్తిపన్ను బకాయిలకు ఇప్పటివరకు రూ. 55.81 కోట్లే వసూలైంది. ఇంకా రూ.74.80 కోట్లు వసూలు కావలసి ఉంది. అయితే ఇందులో సగం వరకు వసూలయ్యే అవకాశం తక్కువని అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రధానంగా అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65 కోట్లకుగాను ఇంతవరకు రూ.5.70 కోట్లే వసూలైంది. మండపేటలో రూ.7.75 కోట్లకు రూ.4.44 కోట్లు, రామచంద్రపురం రూ.9.47 కోట్లకు రూ.3.52కోట్లు, ముమ్మిడివరం రూ.1.57 కోట్లకు రూ.కోటి వసూలైంది. ఈ జిల్లాలో మొత్తం రూ.33.42 కోట్ల పన్నుల వసూలుకుగాను రూ.14.66 కోట్లే జమైంది. ఇంకా రూ.18.76 కోట్ల వరకు రావలసి ఉంది. అయితే మొండి బకాయిలు రూ.9 కోట్ల వరకు ఉన్నాయని ఇవి వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో ఆస్తిపన్నులకు సంబంధించి ఏటా ప్రతి ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు టార్గెట్ల నేపథ్యంలో చాలావరకు నివాస గృహాల నుంచే అధికారులు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, దుకాణాలు, ఖాళీ స్థలాల నుంచి మాత్రం రాబట్టడంలో విఫలమవుతున్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి విశ్వేశ్వరరావు

మహనీయుడు..మహాత్ముడు

వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఘన నివాళి

అమలాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింస, సత్యాగ్రహాలనే ఆయుధాలుగా ఎంచుకుని దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యం అందించిన మహనీయుడిగా మహాత్మాగాంధీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్ముని కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అహింసా పోరాటం ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ మాట్లాడుతూ గాంధీజీ స్థాపించిన సబర్మతి ఆశ్రమం, వార్ధా ఆశ్రమం ఆయన ఆశయాలకు ప్రతిరూపాలన్నారు. నిరాడంబరుడైన గాంధీజీ వృత్తి విద్యలను ప్రోత్సహించారన్నారు. మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి, భూసేకరణ సెక్షన్ అధికారి ఏసుబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి దర్శనం..తొలి కల్యాణం

శ్రీనీలకంఠేశ్వరుడిదే..



అంతర్వేది, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో తొలి దర్శనం, తొలి కల్యాణం పార్వతీ సమేత శ్రీనీలకంఠేశ్వరస్వామికే దక్కుతుందని, స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి 8.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనరు సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అంకురార్పణ, శ్రీస్వామివారికి అభ్యంగన స్నానం, వస్త్రాలంకరణ నిర్వహించారు. సాయంత్రం సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహరణ, బలిహరణ జరిపారు. నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరుగుతాయి.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తాతబ్బాయి

ముమ్మిడివరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లు గోదామునకు పటిష్ఠమైన భద్రతను కల్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప అదనపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, వీవీఎంల రాష్ట్ర నోడల్ అధికారి తాతబ్బాయి ఆదేశించారు. స్థానిక ఎయిమ్స్ కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన గోదామును గురువారం ఆయన డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప అదనపు సీఈవో తాతబ్బాయి మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన గోదాముపై నిరంతరం నిఘా ఉండాలన్నారు. సీసీ కెమెరాల దృశ్యాలను ఆయన పరిశీలించారు. ప్రతీ నెలకు ఒకసారి అధికారులతోను, ప్రతీ మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్ల గోదాములను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర వివరాలతో నివేదికను పంపిస్తున్నట్టు డీఆర్వో రాజకుమారి వెల్లడించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ శివరాజ్‌రామ్మోహనరావు, బాబ్జి సాయిరామ్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

ఎన్నో జీవితాలను కథలుగా మార్చారు.. తందాన తాన తందనాన అంటూ బుర్రకథ రూపంలో ప్రజల చెంతకు తీసుకెళ్లారు.. ఆయన జీవితమూ ఒక కథే.. తరచి చూస్తే ఒక కన్నీటి జీవన ప్రయాణమే.. కళనే నమ్ముకుని ఏం సాధించారంటే పేరు తప్ప ఏం లేదు.. చివరి వరకూ కళనే నమ్ముకున్నారు.. ఆకలితో ఉన్నా ఆ కళను మాత్రం ఆపలేదు.. చివరి వరకూ అదే ఊపిరిగా జీవనయానం సాగించారు.. ఏదో ఒక రోజు తన కళ కడుపునింపక పోతుందా అంటూ ఎదురుచూశారు.. 76 ఏళ్ల జీవితంలో వెను తిరిగి చూస్తే వేల ప్రదర్శనలు.. అయితే ఆయన నమ్మకమే నిజమైంది.. తన కళ కడుపునింపేటంత పద్మశ్రీ అనే బిరుదును తెచ్చింది.. అయితే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి.. ఆ పురస్కారం అందుకోవడానికి మిరియాల అప్పారావు మన మధ్యన లేరు.. ఆయన కుటుంబ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- (ఆంధ్రజ్యోతి/ రావులపాలెం)



బుర్రకథ.. ఊపిరిగా..

మన పద్మశ్రీ మిరియాల అప్పారావు

కళ కళ కోసం ప్రజల కోసం.. అనే అన్వయం కచ్చితంగా బుర్రకథకు దక్కుతుంది. ఎందుకంటే మనకున్న జానపద కళారూపాల్లో హరికథ తర్వాత చాలా ముఖ్యమైన గాన ప్రక్రియ. మన తెలుగువాళ్లు ఈ కథా ప్రక్రియను ఎంత ప్రభావవంతంగా వినియోగించుకున్నారంటే జానపద, పౌరాణిక కథల నుంచి వీరోచిత ఉద్యమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల వరకు అత్యద్భుతంగా బుర్రకథ ఒదిగిపోయింది. ఇలా ఒదిగిపోవడానికి బుర్రకథా పితామహుడిగా షేక్ నాజర్ వేసిన పునాదులు అటువంటివి. ఆయనకు ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. అలనాటి బుర్రకథకుల్లో రావులపాలెంనకు చెందిన మరొక ఆణిముత్యం మిరియాల అప్పారావు. ఇటీవల మరణించిన ఆయనకూ పద్మశ్రీ ప్రకటించింది. ప్రభావవంతమైన కథనంతోపాటు చతురతతో కూడిన హాస్యం, వినోద సంభాషణలతో రాగయుక్తమైన విన్యాసాల మధ్య సాగే బుర్రకథ.. కొన్ని దశాబ్దాలపాటు తిరుగులేని కళగా చరిత్ర సృష్టించింది. దీనికి కారణం ఒక నాజర్.. ఒక మిరియాల.. ఇంకా ఎందరో..

ఇప్పుడు నాణేనికి రెండో వైపు చూద్దాం. దాదాపు అయిదు దశాబ్దాలపాటు బుర్రకథే ప్రాణంగా మిరియాల అప్పారావు చివరి వరకు అదే తపనతో జీవించారు. ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఆయన కుటుంబం యావత్తూ ఇదే రంగంలో ఉండి జీవనం సాగిస్తుండడం. కాకపోతే వేలాది ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల కుటుంబాలు ఏ స్థాయిలో ఉన్నాయో చూద్దామని ప్రయత్నిస్తే చాలాసార్లు మనకు నిరాశే ఎదురవుతుంది. దానికి కారణం ఆ కళనే నమ్ముకుని, ముందు తరం వారసులుగానే తమ జీవితాలను కొనసాగించడానికి వారు శక్తినంతా ధారపోయడమే ఒక శాపమవుతోంది. ఈ నేపథ్యంలో వీరి కృషి కళారంగానికి ఎనలేని సేవ అనాలా.. కళనే నమ్ముకుని తమ 'భవిష్యత్తు'ని ధారపోసిన త్యాగమూర్తులనాలా..

ఇంటిల్లపాదీ బుర్రకథకులే..

కళను నమ్ముకుని ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెచ్చుకున్న బుర్రకథ కళాకారులకు ఇవాళ ఆదరణ లేదు. కేవలం సామాజిక చైతన్య కార్యక్రమాల కోసమే ఈ కళారూపం అన్నట్టుగా మారిపోయింది. ఒక కుటుంబం ఐదు దశాబ్దాలపాటు బుర్రకథ కళారంగంలోనే జీవితం సాగించింది. ఒకరిద్దరు కాదు, ఇంటిల్లపాదీ ఇదే రంగానికి తమ జీవితాలను అంకితం చేసింది. యజమాని నుంచి కూతుర్లు, కొడుకులూ అందరూ ఇదే జీవనం. 50 ఏళ్లుగా.. వేలాది ప్రదర్శనలు.. సత్కారాలు, ప్రశంసలు, బిరుదులు.. హోరెత్తిన జనం చప్పట్లు..ఇవన్నీ దాటుకుని వచ్చిన ఈ కళాకార కుటుంబానికి ఇప్పుడు అష్టకష్టాలు. ప్రముఖ బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు. ఇటీవలే ఆయనకు పద్మశ్రీ లభించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పలకరించినప్పుడు వెల్లడైన అనేక విషయాలు, కుటుంబ స్థితిగతులపై ప్రత్యేక కథనం.

స్మృతిచిహ్నం ఏర్పాటుచేయాలి

ఇంతటి కళాకారుడు తమ మధ్యన తిరగడం మా అదృష్టం అంటున్నారు రావులపాలెం ప్రజలు.. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఆయన ఇంటి చెంతనే ఉన్న పార్కులో మిరియాల అప్పారావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవ కథ విందాం...

మిరియాల అప్పారావు. ఈయనది కాకినాడ జిల్లా నడకుదురు. 1949లో మిరియాల వెంకట రామయ్య, తిరుపతమ్మలకు జన్మించారు. 1969లో బుర్రకథపై ఉన్న ఆసక్తితో ఇందులో అరంగ్రేటం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం దగ్గర శిష్యరికం చేశారు. తర్వాత తనదైన వాక్చాతుర్యంతో, గాన మాధుర్యంతో బుర్రకథ కళాకారుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1974లో ఆలిండియా రేడియోలో, 1994లో దూరదర్శన్‌లో ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించి బుర్రకథల పోటీల్లో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండికప్ గెలుచుకున్నారు. 5వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు, 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ ప్రదర్శనలతో రికార్డు సాధించారు. భార్య నాగమణితో పాటు తన ఏడుగురు సంతానంతో కలిసి బుర్రకథలను చెబుతూ వచ్చారు. అంతే కాకుండా షణ్ముఖ ఆంజనేయరాజుతో కలిసి పలు నాటకాల్లోనూ నటించారు. కళారంగంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పారావుకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. పద్మశ్రీ ప్రకటించే సమయానికి ఆయన మరణించడం, ప్రకటించిన రోజు దశదినకర్మ రావడంతో కుటుంబ సభ్యులకు పద్మశ్రీ వచ్చిందని ఆనందంగా ఉన్నప్పటికీ, అవార్డు గ్రహీత మరణం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర ఆవేదననూ కలిగించింది.

ఇదీ కుటుంబ నేపథ్యం..

పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న మిరియాల అప్పారావుకు భార్య నాగమణి, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుబ్బరాజు, బ్రహ్మాజీ, మిరియాల సిద్ధయ్య, బాబా, వీరనాల పద్మావతి, వీరనాల లలిత, యడవల్లి శ్రీదేవి. వీరిలో శ్రీదేవి తాడేపల్లిగూడెంలో ఉండగా మిగిలిన వారంతా రావులపాలెంలోనే ఉంటున్నారు. అప్పారావు తన 50 ఏళ్ల ప్రస్థానంలో 25 ఏళ్ల కిందట రావులపాలెంలో సొంతింటిని నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇంటిలోనే నలుగురు కుమారులు తమ కుటుంబాలతో ఉండడం విశేషం.

చిన్న డాబా ఇల్లే ఆస్తి

76 ఏళ్ల కళాప్రయాణం..వేల ప్రదర్శనలు.. ఆయనకు ఉన్నది మాత్రం రావులపాలెంలో పార్కు వద్ద 4 సెంట్లు అంటే అంటే సుమారు 200 గజాల స్థలం.. ఆ స్థలంలోనే సుమారు 30 ఏళ్ల కిందట కట్టిన రెండు పోర్షన్ల చిన్న డాబా ఇల్లు.. అదే ఆస్తి.. ప్రస్తుతం ఆ చిన్న ఇంటిలోనే మిరియాల అప్పారావు నలుగురు కుమారులు సుమారు 20 మంది కుటుంబీకులు నివాసం ఉంటున్నారు.. తండ్రి వారసత్వంగా వచ్చిన బుర్రకథ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.



కుటుంబంతో మిరియాల అప్పారావు (ఫైల్)

చివరి కోరిక ఇదే..

ఆయన ధ్యాస.. శ్వాస బుర్రకథ.. అందుకే చివరి కోరిక కూడా అదే.. బుర్రకథ కోసం ఓ సంస్థను నెలకొల్పి నేర్పించాలన్నది ఆయన చివరి కోరిక. తరచూ కుమారులకు అదే చెబుతుండేవారట.. ఆ కోరిక తీరలేదు. బుర్రకథకు ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆ అవకాశం కలగలేదు.. ప్రభుత్వం ఆ అవకాశం తమకు కల్పించాలని కుమారులు వేడుకుంటున్నారు.. ప్రభుత్వం సహకరిస్తే బుర్రకథ కళను నలుగురికి నేర్పించి.. తమ తండ్రి చివరి కోరిక తీర్చుతామని చెబుతున్నారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతున్నారు.

నాన్న లేకపోవడం బాధగా ఉంది..



మా నాన్నగారు కళకోసం ఎంతో శ్రమించారు.. మా కంటే బుర్రకథనే ఎక్కువగా ప్రేమించారు. ఆయన శ్రమకు ఈనాటికి ఫలితం లభించింది. కానీ ఆయన నేడు మా మధ్య లేకపోవడం బాధగా ఉంది. కళ కోసం ఎంత కష్టపడ్డారో నేను దగ్గరగా చూశా.. ఇప్పటివరకూ ఆయన 5 వేల ప్రదర్శనలు ఇచ్చారు. నేను పదవతరగతి వరకూ చదువుకున్నా.. ఆ తరువాత నాన్నగారి ప్రమేయంతో కళారంగంలో అడుగుపెట్టా.

- మిరియాల సుబ్బరాజు, కుమారుడు

ప్రభుత్వం మాకు దారి చూపాలి..



బుర్రకథకు ఆదరణ తగ్గిపోయింది.. కళాకారుల కష్టానికి తగ్గ పారితోషికం దొరకకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఒకప్పుడు గణపతి, దేవినవరాత్రుల పర్వదినాలు, జాతర్ల సమయాల్లో ఆయా రోజుల్లో ప్రత్యేకంగా బుర్రకథ కళాకారులతో స్టేజీ ప్రోగ్రామ్‌లు చేయించేవారు. కానీ నేడు అలా లేదు.. బుర్రకథలకు ఆదరణ లేక కళాకారుల జీవన మనుగడ కష్టతరంగా మారింది. మా పరిస్థితి అలాగే ఉంది.. ప్రభుత్వమే దారి చూపాలి. **- మిరియాల బ్రహ్మాజీ, కుమారుడు**

నాన్నబాటలో నడిచాం కానీ..?



చిన్నప్పటి నుంచి మా నాన్న అడుగుజాడల్లోనే నడిచాం. బుర్రకథపై ఉన్న మక్కువతో ఈ రంగంలో స్థిరపడినప్పటికీ ప్రస్తుతం ఆదరణ కనుమరుగవ్వడం బాధగా ఉంది. బుర్రకథ ఏర్పాటు చేసే నిర్వాహకులు తగ్గిపోయారు. అరకొరగా ఇచ్చే ప్రదర్శనలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే వస్తున్నాయి. ఆ కొంత మొత్తం కథ చెప్పిన ముగ్గురు, పంచుకోవాల్సి వస్తోంది. ఈ వయసులో వేరే వృత్తుల వైపు వెళ్లలేక ఇబ్బందికర జీవనం సాగిస్తున్నాం. **- వీరనాల లలిత, కుమార్తె**

వచ్చే నెలా.. అరకొరే !



- ఇంతవరకూ జిల్లాకు కందిపప్పు కేటాయింపు నిల్
- 20 శాతం మందికి మాత్రమే అందే అవకాశం
- పండగ ముందు 30 శాతం లబ్ధిదారులకే అందిన పప్పు
- జిల్లాకు 500 టన్నుల అవసరం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నెలలో కూడా కందిపప్పు అరకొరగానే అందనుంది. సంక్రాంతి నెలలో పూర్తిస్థాయిలో సరఫరా కాని విషయం తెలిసిందే. దీంతో వచ్చేనెల కూడా 20 శాతం మంది మాత్రమే పొందనున్నారు. గుజరాత్ నుంచి నాణ్యత లేని సుమారు 200 టన్నుల పప్పు రావడంతో తిరిగి పంపించేశారు. ప్రస్తుతం కొత్త టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందే అవకాశం లేదు. పప్పును తిరిగి పంపించేయడంతో ఈ నెలలో కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. గత నవంబరు నెల నుంచి ప్రతి కార్డుదారుడుకి రూ.67కే కేజీ కందిపప్పు ఇస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ. 110 నుంచి 180 వరకూ విక్రయిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ సబ్సిడీపై రూ.67కే నాణ్యమైన పప్పు అందివ్వడంతో ప్రజలంతా చాలా సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు ఇవ్వడం మానేసింది. పైగా ఎవరూ కందిపప్పు తినడం లేదని ప్రచారం కూడా చేసింది. కానీ గత ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెల నుంచి మళ్లీ అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో నాణ్యమైన పప్పు రాకపోవడం వల్ల జిల్లాకు కేవలం 60 శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు. అందులో జిల్లాలోని గోపాలపురం, నిడదవోలు, కోరుకొండ, బొమ్మూరు, బిక్కవోలులో ఐదు ఎంఎల్ పాయింట్లు ఉన్నాయి. ప్రభుత్వం పౌరసరఫరా సంస్థకు కేటాయిస్తే, అక్కడ నుంచి ఎంఎల్ పాయింట్లకు సరుకు వస్తుంది. అక్కడ నుంచి మండలాల వారీ ఆయా రేషన్ డిపోలకు సరఫరా అవుతుంది. అయితే వివిధ కారణాల వల్ల జనవరిలో కూడా జిల్లాకు కేవలం 60 శాతం మాత్రమే కేటాయించారు. అందులో సుమారు దాదాపు ఎనిమిది లారీలలో వచ్చిన సుమారు 200 టన్నుల కందిపప్పు పాడైపోవడంతో తిరిగి పంపించారు.ఈ పరిస్థితులలో జిల్లాలో కేవలం 30 శాతం నుంచి 35 శాతం మంది లబ్ధిదార్లకే అందింది. జిల్లాకు కేటాయించిన పప్పులో ఐసీడీఎస్‌కు, గర్భవతులకు కూడా పప్పు పంపిణీ చేయ వలసి ఉంది. ప్రస్తుతం అధికారులు అంగన్‌వాడీలు, గర్భవతులకు పప్పు కొరత లేకుండా చూడగలుగుతున్నారు. కానీ జిల్లాలో రేషన్‌కార్డుల ద్వారా పొందే వారికి మాత్రం ఇవ్వలేకపోతున్నారు. జిల్లాలోని 5 లక్షల 75 వేల మంది రేషన్‌కార్డుదారులకు ఒక్కో కార్డుకు ఒక కేజీ వంతున పంపిణీ చేయవలసి ఉంది. కానీ కేవలం 30 శాతం మందికే పప్పు అందడంలో అందరూ పండగ రోజున అసంతృప్తి చెందారు.. కొంత పప్పు మాత్రమే రావడం వల్ల పండగ ముందు రోజులలో కొంతమందికి బాగానే సరిపెట్టారు. తర్వాత రోజులలో ఎవరికి పప్పు అందలేదు. గతనెల కోటా కింద ఆలస్యంగా సుమారు 60 టన్నుల వరకూ కందిపప్పు వచ్చింది. అందులో అంగన్‌వాడీలు, గర్భిణులకు సరిపెట్టగా, మిగిలినది ఫిబ్రవరి నెలలో పంపిణీ చేయనున్నారు. గతనెలలో కందిపప్పు పూర్తిగా అందని రాజానగరం మండలంలో వచ్చేనెలలో పూర్తిగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మిగతా చోట్ల గత నెలలో అందని వారికి వచ్చేనెలలో ఉన్నంత మేర పంపిణీ చేసే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. గతనెల కోటా కింద ఇంకా 110 టన్నులు పప్పు రావలసి ఉంది. అదికాక ఫిబ్రవరి కోటా కింద 500 టన్నులు రావాల్సి ఉంది. సాధారణంగా ప్రతినెలా 1వ తేదీ నుంచి 15లోపు ఎంఎల్ పాయింట్లకు పప్పు వస్తుంది. దానిని ప్రతినెలా 20 నుంచి 25 వరకు ఒక విడతగా, 25 నుంచి 30 లోపు రెండో విడతగా రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. ఈనెల ఇంతవరకూ జిల్లా కు కేటాయింపులు రాకపోవడంతో వచ్చేనెలలో కేవలం 20 శాతం మందికి పప్పు అందేటట్టయినా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

'ఆదిత్య'లో జాతీయస్థాయి

ఐడియా థాన్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిత్య ప్రొ ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో ఈనెల 30, 31 తేదీల్లో ఐడియాథాన్ జాతీయ స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఏఐసీటీ హబ్ ఫౌండేషన్, టెక్కీబాట్ సంస్థల భాగస్వామ్యంతో జరగనుంది. రెండురోజుల ఐడియా థాన్‌లో దేశ వ్యాప్తంగా 300కు పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రోబోటిక్స్ ఆటోమొబైల్ ఆటోమేషన్ మొదలైన వాటిని ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు తమ సృజనాత్మక ఆలోచనలు ప్రదర్శిస్తున్నారు. ఈ వేడుక ద్వారా దేశంలో ఉన్న ప్రతిభా లక్షణాలను, జ్ఞానాన్ని, సాంకేతికతలను సమీకరించి, యువతకు పరిశ్రమ 4.0 నైపుణ్యాలను నేర్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆదిత్య ప్రొ ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజేష్‌కుమార్ అడ్ల టీహబ్ సీఈవో, టెకీబోట్ ఫౌండర్ సీఈవో నల్లమిల్లి వెంకటరెడ్డి హాజరయ్యారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా వైడీ రామారావు



రామారావును సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ నూతన చైర్మన్‌గా కాకినాడ జిల్లాశాఖ చైర్మన్‌గా ఉన్న వైడీ రామారావు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహకవర్గ సమావేశంలో రామారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి రాజీనామా కారణంగా ఏర్పడిన ఖాళీలో రామారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 26 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్‌తో అనుబంధం కలిగి 8 సంవత్సరాలుగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా శాఖ, కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు అత్యున్నత జాతీయ రెడ్‌క్రాస్ పురస్కారం రాష్ట్రపతి బంగారు పతకాన్ని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ జిల్లా శాఖ పురస్కారాలను పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైడీ రామారావును రెడ్‌క్రాస్ సభ్యులు, ప్రముఖులు అభినందించారు.

2న హాకీ మహిళా జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి); రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు హాకీ ఉమ్మడిజిల్లా మహిళా జట్టు ఎంపిక ఫిబ్రవరి 2న కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తారని హాకీ సంఘ జిల్లా కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైనవారు వచ్చేనెల 8నుంచి నెల్లూరులో జరిగే సీనియర్ మహిళా హాకీ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.క్రీడాకారులు 2న హాకీ స్టేడియంలో హాజరుకావాలన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పిఠాపురం కవికి సత్కారం

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవికి సత్కారం లభించింది. మద్రాసు యూనివర్సిటీలోని మద్రాసు తెలుగుశాఖ ఆధ్వర్యంలో మెరీనా ఆవరణలో రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిఠాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకు డు, రచయిత చిందాడ చిన్నోడు హాజరయ్యారు. ఇందులో భాగంగా జరిగిన తొలి తరం ముస్లిం కవి, ఆధ్యాత్మికవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు బ్రహ్మర్షి ఉమర్‌ఆలీషా సాహిత్యం-బహుముఖీనత సదస్సులో డాక్టర్ ఉమర్ ఆలీషా వారి ఖండకావ్యములు-సామాజిక సందేశం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. ఇదే అంశంపై సదస్సులో ప్రసంగించారు.



చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవి చిందాడ చిన్నోడును సత్కరిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా చిన్నోడును మద్రాసు యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నోడును సదస్సులో పాల్గొన్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా, సినీ గేయ రచయిత భువనచంద్ర, వ్యాసిలి వసంతకుమార్, డాక్టర్ పాండురంగం కాళియప్ప తదితరులు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆరుగురు ఏపీటీ విద్యార్థులకు ఉద్యోగాలు

- ఒక్కొక్కరికీ రూ.9.02 లక్షల వార్షిక వేతనం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జనార్దనరావు

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో టెక్సాస్ ఇనుస్ట్రుమెంట్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లి జనార్ధనరావు తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.9.02లక్షల వార్షికవేతనం లభించనుందన్నారు. పి.సాయిఅలేఖ్య, ఆర్.అనూష, జి.సిద్ధు, ఏ.లక్ష్మీగణపతి, వి.వంశీకృష్ణ, వి.సిద్ధార్థలు ల్యాబ్‌టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంతటివేతనంతో ఉద్యోగాలు లభించడంలేదన్నారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో విద్యార్థులు ఈఘనత సాధించారన్నారు. విద్యార్థులను టీపీవో, ప్రిన్సిపాల్ అభినందించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు పాదయాత్ర

గొల్లప్రోలు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు శ్రీకాకుళంజిల్లా రణస్థలం మండలం బవరాజుపాలెం నుంచి ఒక కుటుంబం పాదయాత్రగా మంగళగిరి బయలుదేరారు. వీరు గురువారం సాయంత్రం గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలోని వైజంక్షన్ వద్దకు చేరుకున్నారు. భార్యాభర్త కలిసి ఈ పాదయాత్ర చేపట్టారు. బవరాజుపాలెం దారు బంద ట్యాంకు సర్వే నెంబరు 10లో 1.50 ఎకరాల భూమికోసం తమ కుటుంబం 35 ఏళ్లగా పోరాటం చేస్తున్నదని, మాకు మీరే న్యాయం చేయాలంటూ ఉన్న ఫ్లెక్సీని పట్టుకుని వారు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పవన్‌ను రెండుసార్లు కలిశామని, ఈసారి మంగళగిరిలో స్వయంగా కలిసి మరోమారు విన్నవించనున్నట్లు వారు తెలిపారు. మీ ఆదేశాలను కూడా రెవెన్యూ అధికారులు పాటించడంలేదని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు మంగళగిరి పాదయాత్రగా వెళుతున్న కుటుంబం

నేనే ముందు..



జాతీయ రహదారి ఎర్రకోనేరు వద్ద భారీ లోడుతో వెళుతున్న ట్రాలీ లారీ

- జాతీయ రహదారిపై భారీ లోడ్‌తో ట్రాలీ లారీ
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

తుని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపైకి 42 అడుగుల వెడల్పు, 42 అడగుల ఎత్తుతో కూడిన పెద్ద బాయిలర్‌తో జాతీయ రహదారిపై ఒక వాహనం రావడంతో వెనుక ప్రయాణించే వాహనాలు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. విదేశాల నుంచి కాకినాడ పోర్టికి దిగుమతి అక్కడ నుంచి ఒడిశాకి ఒక భారీ ట్రాలీ లారీపై లోడ్ అయ్యి ఒడిశా వైపుకి 16వ నెంబరు జాతీయ రహదారి మీదుగా బయలుదేరింది. హైవే అథారిటీ సిబ్బంది రోజుకు 18 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు అనుమతులు జారీ చేయడంతో వివిధ శాఖల అధికారులుసమన్వయంతో ఈ వాహనాన్ని ముందుకు నడిపించారు. ఇది రహదారిపై నడిచే క్రమంలో వెనుక ఉన్న వాహనాలు ముందుకు కదిలేందుకు వీలు లేకపోవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్ అయ్యింది. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, అధి కారులు అసహనం వ్యక్తంచేశారు. ఈ వాహనం రాకతో జాతీయ రహదారిపై కరెంటు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అల్లవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ వారధిపైనుంచి మంగళవారం గోదావరిలో దూకిఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహం పాశర్లపూడి వైపున లభ్యమైందని పోలీసులు తెలిపారు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జవ్వాది కృపాకిరణ్(25) చెన్నైలోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల సొంతూరు వచ్చిన అతడు మంగళవారం బోడకుర్రు బ్రిడ్జిపై తన యాక్సిస్ స్కూటర్ వదిలి గోదావరిలో దూకేశాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు గతంలో మృతి చెందగా తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడు. అతడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

రైలులో ప్రయాణికురాలి బంగారం గల్లంతు

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా 8 గ్రాముల బంగారు గాజు పోయిందని ఓ ప్రయాణికురాలు సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. చక్రవర్తుల షణ్ముఖరాణి అనే మహిళ గురువారం లింగంపల్లి-కాకినాడ రైలులో ప్రయాణించింది. ప్రయాణంలో చేతికిఉన్న 2బంగారు గాజులను హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని ఉదయం సామర్లకోటలో రైలు దిగింది. బ్యాగులో చూసుకోగా ఒక గాజు మాత్రమే ఉన్నట్లు గుర్తించి అప్పటికి కాకినాడకు చేరుకున్న రైలులో తాను ఎక్కిన బోగీ గాలించినా బంగారు గాజు ఆచూకీ కనిపించలేదని, 8 గ్రాముల బంగారు గాజు విలువ రూ.80వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది.

భూముల విలువలకు రెక్కలు



- ఫిబ్రవరి 1 నుంచి అమలుకు సన్నాహాలు
- జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుకు ఇరువైపులా భూముల ధరల పెంపు
- 10నుంచి 20శాతం వరకూ పెంపుదలకు నిర్ణయం

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచేందుకు కసరత్తు పూర్తి చేసింది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెంచిన భూముల విలువలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్, ఐజీ కార్యాలయంనుంచి ఉత్తర్వులందాయి.

నెల క్రితం వాయిదా

డిసెంబరు నెలలో రాష్ట్ర ఐజీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థానిక సంస్థల కమిషనర్లతో వార్డులవారీగా భూముల విలువలు పెంపుదలకు కార్యాచరణ పూర్తిచేశారు. జనవరి 1నుంచే పెంపుదల విలువలను అమలుకు అప్పట్లో నిర్ణయించినా ప్రభుత్వం వాయిదా వేసింది. తిరిగి నెలరోజుల అనంతరం భూముల విలువలు పెంపుదలకు తాజాగా ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చి ఫిబ్రవరి 1నుంచి అమలుకు ప్రకటన చేశారు. గతంలో స్పెషల్ రివిజన్‌లో అధిక పెంపును సవరిస్తూ స్థిరాస్తిదారులకు భారం కాని విధంగా 10 నుంచి 20 శాతం మేర మాత్రమే భూముల ధరలు పెంచి ఫిబ్రవరి 1 నాటికి పెంచిన ధరలతో రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయిగా మారింది.

10శాతంపైనే పెంపునకు నిర్ణయం

బహిరంగ మార్కెట్లో భూములకు విలువలు అధికంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ విలువలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం ప్రజావసరాలకోసం భూములను కొనుగోలు చేసే సందర్భాల్లో భూములు అమ్మేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10శాతం నుంచి 35శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్లుగా రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు నివేదికలు తయారుచేశారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లతోను, పంచాయతీ ఉన్నతాధికారులతోను గత డిసెంబరులో 19న కాకినాడలో సమావేశం నిర్వహించారు.

ఆ భూముల ధరలు పెంపు

చాన్నాళ్లుగా భూముల మార్కెట్ విలువలు పట్టణ ప్రాంతాలు, కమర్షియల్‌గా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగే ప్రాంతాల్లో మాత్రమే భూములు, స్థలాల ధరలు పెంపు జరుగుతోంది. ప్రతిఏటా జనవరి, మార్చి నెలల్లో ధరలు పెంచడం రిజిస్ట్రేషన్ శాఖకు ఆనవాయితీ. కానీ ఈ దఫా గత ప్రభుత్వ హయాంలో అధిక పెంపును సవరిస్తూ జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డులకు ఇరువైపులా భూముల విషయంలో ధరల పెంపుదలకు ఉమ్మడి తూర్పు జిల్లాలో పెద్దకసరత్తు చేసినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుల్లో ఇరువైపులా భూముల్లో అనధికారికంగా కమర్షియల్‌గా కోట్ల రూపాయలతో నిర్మాణాలు సాగుతున్నాయి. భూముల ధరలు ఎకరానికి రూ.60 నుంచి రూ.80 లక్షలకు మించేవికావు. ఇదే భూములను కమర్షియల్‌గా లెక్కిస్తే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర అక్షరాలా రూ.5కోట్ల నుంచి రూ.8కోట్ల పై మాటే. దీనివల్ల రిజిస్ట్రేషన్‌శాఖ రాబడికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. రైతులకు తమ వ్యక్తిగత అవసరాలకోసం బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణాలు దక్కని పరిస్థితిని కూటమి ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల రాబడికి..

జగనన్న భూరక్ష పేరిట భూముల రీసర్వే తప్పుల తడకగా సాగింది. రైతులకు సంబంధించిన భూములకు సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్(ఎల్‌పీ) నెంబర్లు కేటాయించారు.ఆభూమిని రైతు తన ఇబ్బందుల రీత్యా కొంత అమ్ముకుంటే ఆ భూమిని కొన్న వ్యక్తులకు భవిష్యత్తులో రెవెన్యూ రిజిస్ట్రేషన్ల కష్టాలు తప్పడం లేదు. దీంతో రీసర్వేలో అనాలోచిత నిర్ణయాలతో ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన జిల్లాలో కొన్ని గ్రామాల్లో స్థిరాస్థిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ సమస్యలను పరిష్కారానికి అధికారులు ముందుకు రాలేదు. రెవెన్యూసదస్సుల్లో ఎల్‌పీ నెంబర్ల విధానం సవరణలపై ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది.

ఫిబ్రవరి 1 నుంచి..

జిల్లాలో అన్నిముఖ్యమైన ప్రాంతాల్లో సెంటు (48 చదరపు గజాలు) భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో, లక్షల్లో ఉంటుంది. కానీ, ఎకరా భూమి రూ.5కోట్ల వరకూ పలుకుతోంది. రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూములు మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను ఈ విలువలు పెరగనున్నాయి. గత డిసెంబరు నెల 20న భూముల విలువల పెంపుదల పత్రాలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. ప్రజల అభిప్రాయాలను సైతం సమీకరించింది. ఫిబ్రవరి 1 నుంచి పెంచనున్న మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురానున్నారు. రాజానగరం ఏడీబీ రోడ్డు నుంచి సామర్లకోట మండలం అచ్చంపేట జంక్షన్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఎకరా భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లనుంచి రూ.10 కోట్ల వరకూ ధర పలుకుతుంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.60లక్షలనుంచి రూ.80లక్షల వరకూ మాత్రమే ఉంది. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో సైతం ఎకరాకు రూ.25లక్షలలోపు మాత్రమే ఉంది. ఇదే రీతిలో పలు పట్టణ ప్రాంతాల్లో కూడా చదరపు గజాల మార్కెట్ ధరలు రూ.9వేలలోపు మాత్రమే ఉండగా మూడు రెట్లు అదనంగా ధరలు పలకడం గమనార్హం.

టిస్‌లో తప్పుల మార్పుకు మరో అవకాశం

- నేటి సాయంత్రంలోపు చేసుకోవాలి
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల డైరెక్టర్ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా వారి టిస్(టీఐఎస్) పూర్తి వివరాలను www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో వ్యక్తిగత హాజరు యాప్ లాగిన్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఆ వివరాల్లో ఏమైనా తప్పులుంటే మార్పులు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ మరో అవకాశం కల్పించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా వారి వివరాల్లో తప్పులేమైనా ఉంటే శుక్రవారం సాయంత్రం లోపు మార్పులు చేసుకోవాలన్నారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.33కోట్లు

అన్నవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ.1,33,16,044 నగదు, 62 గ్రాముల బంగారం, 525 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటు యుఎస్‌ఏకు చెందిన 369 డాలర్లు, ఇండోనేషియా 1200000 ఇండోనేషియన్ రుపియా, ఆస్ట్రేలియా 100 డాలర్లు, సింగపూర్ 50 డాలర్లు, ఇంగ్లాండ్ 65 పౌండ్స్‌ను భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.43లక్షలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య



చంద్రశేఖర్ మృతదేహం

- మరో వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోన్న ప్రియురాలు
- చిరునామా తెలుసుకుని వచ్చి ఘర్షణ పడిన ప్రియుడు
- ఇనుప దస్తాతో మోది కడతేర్చిన యువతి
- కాకినాడలో ఘటన

కాకినాడ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని ప్రియురాలే కడతేర్చిన సంఘటన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంలోని చినమల్లంకు చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామి(30) రావులపాలెంలో ఉంటూ వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఈ క్రమంలో అతనికి రావులపాలేనికి చెందిన 25ఏళ్ల మునిస్వామిలావణ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే చిత్తూరుజిల్లాకు చెందిన బాలు అనే వ్యక్తితో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక విడిపోయారు. కాగా చంద్రశేఖర్‌స్వామికి తెలియకుండా లావణ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసే మరో వ్యక్తి లోవరాజుతో సహజీవనం చేస్తూ అతడితో కలిసి గుట్టుచప్పుడు కాకుండా రెండునెలల క్రితం కాకినాడలోని డైరీఫారం సెంటర్ స్వర్ణాంధ్రకాలనీలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. లావణ్య కాకినాడలో మరో వ్యక్తితో సహజీవనం చేస్తోందని ఆ ఇంటి చిరునామా తెలుసుకుని చంద్రశేఖర్‌స్వామి బుధవారం రాత్రి ఆ ఇంటికి వచ్చాడు. అక్కడ లావణ్యతో ఘర్షణ పడ్డాడు. అలా తెల్లవారుజాము వరకు ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విషయం ఇంతవరకు వచ్చాక తనను చంద్రశేఖర్ అంతం చేస్తాడని గ్రహించిన లావణ్య మసాల దంచే ఇనుప అమన్ దస్తాతో చంద్రశేఖర్ తలపై బలంగా విచక్షణారహితంగా మోదడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆమె పరారైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోర్ట్ సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు చేసి.. తీర్చలేక..



ఆత్మహత్యకు పాల్పడిన వరలక్ష్మి మృతదేహం

- పురుగుల మందు సేవించి ఆపై చికిత్స పొందుతూ.. ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో ఘటన

అనపర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆమెది ఓ మధ్య తరగతి కుటుంబం.. అయితేనేం సమాజంలో గొప్పగా బతకాలని కలలు కని.. ఇంట్లో ఏ వేడుక జరిగినా తలకు మించి అప్పులు చేసేది. దాన్ని తీర్చే ధైర్యం లేకపోవడంతో చివరకు తనువు చాలించింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన వాశిరెడ్డి వరలక్ష్మి(32) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తుంది. ఈమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె తన కుమార్తె వేడుక చేసేందుకు స్థోమతకు మించి అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చలేక, ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక మధనపడుతూ మంగళవారం పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సకాలంలో వైద్యమందించి ప్రాణాలను నిలబెట్టారు. చివరకు గురువారం ఉదయం వేకువజామున 4గంటల సమయంలో ఆమె చికిత్స పొందుతున్న ఆస్పత్రి భవనంపైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడగా, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకే ప్రత్యేక శిబిరాలు

పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ



ప్రదర్శనలో ఉన్న పశువులను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి సంపద పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ అన్నారు. కిర్లంపూడి మండలంలోని గోనేడ గ్రామంలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా జేడీ రామస్వామి ఆధ్వర్యంలో ఉపసంచాలకులు డాక్టర్ అంబేడ్కర్, పెద్దాపురం సంచాలకులు రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ హాజరయ్యారు. పశువైద్యాధికారి నయీమ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 36 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో ఎంపికైన వాటికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పశుసంపదను రైతులు పెంచుకోవాలన్నారు. రైతులకోసం ప్రభుత్వం 23,500 గోకుల షెడ్‌లను మంజూరు చేసిందన్నారు. పశువులకు ఇచ్చే ఇంజక్షన్ ధర రూ.1350కుగాను పాడి రైతులకు రూ.500కే అందిస్తున్నామన్నారు. 50 సెంట్లు భూమిలో రెండేళ్లపాటు పచ్చగడ్డి పెంచితే సంవత్సరానికి రూ.32వేల చొప్పున రూ.64వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. పాడిపశువులకు ఇన్సూరెన్స్ అందిస్తున్నామని, రైతులు రూ.400 కడితే ప్రభుత్వం రూ.1200 జమచేసి మూడేళ్లపాటు ఇన్సూరెన్స్ వర్తించేస్తుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. మండపేట పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ డైరీఫారం సెంటరు వద్ద నివాసం ఉంటూ కోరమండల్ సంస్థలో పని చేసే ఓలేటి గంగాధరం(50) బుధవారం మండపేటలోని బూరుగుంట చెరువు వద్దకు వచ్చాడు. అక్కడ మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించడంతో వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు దీన్ని గమనించి 108 వాహనంలో మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ గొడవల కారణంగా గంగాధరం దీనికి పాల్పడినట్టుగా భావిస్తున్నారు. గురువారం చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు అతడి భార్యకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఏఎస్ఐ చిన్నారావు తెలిపారు.

మహిళా పోలీసుపై హోంగార్డు దాడి

ద్రాక్షారామ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల మహిళా పోలీసు తనపై హోంగార్డు దాడి చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహిళా పోలీసు వైదాడి ఉమామహేశ్వరి, హోంగార్డు కుమార్‌రాజువద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.లక్ష ఒకసారి, రూ.14వేలు ఒకసారి ఆమె చెల్లించింది. ఈనెల 16న అతడు డబ్బులు అడుగుతూ జుట్టు పట్టుకుని బూతులు తిడుతూ దాడి చేశాడని పోలీసులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి రంపచోడవరం జాబ్‌మేళా రద్దు

పాడేరురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 31న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించాల్సిన జాబ్‌మేళాను రద్దు చేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్ పి.రోహిణి గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జాబ్‌మేళాను రద్దు చేశామన్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి ఒంటిపై గాయాలతో అనుమానాస్పదంగా మృతి చెందిన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. కాకినాడ డైరీఫాం సెంటర్‌లోని పర్లోవపేట టిడ్కో గృహ సముదాయంవద్ద గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని 30ఏళ్ల పురుషుడు విగతజీవిగా రోడ్డు పై పడి ఉన్నాడు. కాగా ఆ విషయాన్ని స్థానిక వీఆర్‌వో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం సంఘటనా స్థలానికి పోర్టు ఎస్‌హెచ్‌ఓ సునీల్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి గుండెలపైన, తల వెనుక భాగంలోను గాయాలు ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజాము సమయంలో మృతుడు తూలుతూ నడుచుకుంటూ వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణోత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్
- అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలపై అధికారులతో సమీక్ష



అంతర్వేది స్వామివారి వార్షికోత్సవంపై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంతర్వేది, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. అంతర్వేది ఆలయ పరిసర ప్రాంతాలైన బీచ్, ఫెర్రీ పాయింట్లను పరిశీలించి అనంతరం కల్యాణ వేదిక వద్ద జిల్లాస్థాయి అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వామివారి ఆలయ ప్రాంతం, బీచ్, బోటు పార్కింగ్ తదితర ప్రాంతాలను భక్తులు సులభతరంగా గుర్తించేందుకు పంచాయతీరాజ్ విభాగం వారు సైన్ బోర్డులు, దేవాలయ ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవస్థానంలో ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్, స్నానఘట్టాల వద్ద మినీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. 21 శాఖల సిబ్బంది 24/7 పనిచేయడం జరుగుతుందని, వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తూ మొత్తం వ్యవస్థను పరీక్షించాలన్నారు. 'ఈ సారి సీసీ కెమెరాలను గత సంవత్సరం కంటే ఎక్కువ ఏర్పాటు చేశాం. బస్టాండు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లు, బీచ్ వద్ద సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రమాదాలకు తావు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలి. జిల్లా రవాణాధికారి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల వాహనాలు ఓవర్‌లోడ్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాగునీటిని సమృద్ధిగా అందించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం 120 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య వ్యవస్థను పర్యవేక్షించాలి. 11 పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ కంట్రోల్ రూముకు అనుసంధానించాలి. పారిశుధ్య ప్రక్రియను డీఎల్డీవో పర్యవేక్షించాలి. అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆలయం చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో వీధిలైట్లు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించాలి. జిల్లా పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు శాఖల అధికారులు సమన్వయంతో ధరల నియంత్రణపై దృష్టి సారించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్సవాల్లో ప్రసాదాలు, ఆహార పదార్థాలను వర్తకులు అమ్మే ఆహార పదార్థాలను పరిశీలించి కల్తీ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కల్యాణవేదిక వద్ద అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి ముందుగానే పాస్‌లు మంజూరు చేస్తారన్నారు. రథోత్సవ ప్రక్రియను డ్వామా పీడీ పర్యవేక్షిస్తూ వేతన కూలీల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవంలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రథం ఫిజికల్ ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాలన్నారు. చక్రస్నాన ప్రక్రియను రామచంద్రపురం ఆర్డీవో అఖిల పర్యవేక్షిస్తారన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఐదు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టుపక్కల ఆసుపత్రులను అత్యవసర సమయంలో వినియోగించే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ 105 బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల రాకపోకలు సురక్షితంగా నిర్వహించాలన్నారు. డ్రోన్ చిత్రీకరణను కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించాలన్నారు. టోయింగ్ వాహనాలను రెండింటిని ఏర్పాటు చేయాలన్నారు. మెరైన్ పోలీసులు బీచ్ వద్ద పర్యవేక్షించాలన్నారు. ఉత్సవాల్లో మద్యం షాపులను పూర్తిగా మూసివేయించాలని పోలీసులను ఆదేశించారు. ప్రధాన కంట్రోల్ రూము నుంచి ప్రతీ గంటకు జిల్లా కలెక్టర్ ఫోన్‌కు ఉత్సవాల నిర్వహణ తీరు పట్ల సందేశాన్ని పంపించాలన్నారు. ప్రధాన కమాండ్ కంట్రోల్ రూము స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్సీ ఇన్‌చార్జిగాను, మినీ కమాండ్ కంట్రోల్ రూముకు డీఆర్డీఏ పీడీ ఇన్‌చార్జిగా వ్యవహరించాలన్నారు. అగ్నిమాపక, విపత్తు స్పందన సంస్థ, అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాల

అమలాపురం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గున్నేపల్లి అగ్రహారం గ్రామస్తులు

ఓహెచ్ఎస్సార్ నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టరేట్ ఎదుట గున్నేపల్లి అగ్రహారం గ్రామస్తుల ధర్నా

అమలాపురం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా గ్రామస్తులకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఓహెచ్ఎస్సార్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గున్నేపల్లి అగ్రహారం గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. పంచాయతీ తీర్మానం చేసిన ప్రభుత్వ స్థలంలో ఓహెచ్ఎస్సార్ నిర్మాణం ఇప్పటికే చేపట్టారని, అర్ధంతరంగా నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు (రాము) ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసనకు దిగారు. రక్షిత మంచినీరు పూర్తిస్థాయిలో అందక ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, ఓహెచ్ఎస్సార్ నిర్మాణం పూర్తిచేసి ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న డీఈవో సలీంబాషా

'ఉద్యోగ కాలంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి'

ముమ్మిడివరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కాలంలో అందించిన సేవలే ప్రజల్లో వారికి గుర్తింపునిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. డీఈవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.చామంతి, సమగ్ర శిక్షా కార్యాలయ ఆఫీసు సబార్డినేట్‌గా ఎం.వెంకన్న ఉద్యోగ విరమణ సందర్భంగా డీఈవో కార్యాలయంలో ఏడీ నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన సన్మాన, వీడ్కోలు సభకు డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చామంతి, వెంకన్నలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సమగ్రశిక్షా ఫైనాన్స్, అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా ఈఈ సుబ్బరాజు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ భాను, ఏఎస్‌వో డి.తాతారావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సెక్టోరియల్ అధికారులు డి.రమేష్, ఎంవీవీ సత్యనారాయణ, ఏఎస్‌వో నారాయణ, వరప్రసాద్, డీఈఈ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఏపీవో ఆదినారాయణ, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ నేతలు

మలికిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో కూటమి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బీజేపీ మండల శాఖల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన నాయకులు గురువారం ఎమ్మెల్యేను విశ్వేశ్వరాయపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మేడిచర్ల చాణుక్య, చెల్లింగి వెంకటనాగదుర్గాలక్ష్మీదేవి, పోతురాజు సురేష్, భైరవశెట్టి రామకృష్ణలను ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, కె.కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2న భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభ

ఉప్పలగుప్తం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 2న రామచంద్రపురంలో జరిగే భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభను విజయవంతం చెయ్యాలని కార్మికుల సమావేశం పిలుపునిచ్చింది. కార్పెంటర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవల్లి చినబాబు అధ్యక్షతన గొల్లవిల్లిలో సమావేశం జరిగింది. ఆత్మగౌరవ సభ వివరాలతో కరపత్రాలను విడుదల చేశారు. భవన నిర్మాణ కార్మికుల కష్టాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి, భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని పునర్ వ్యవస్థీకరించాలని కోరే లక్ష్యంతో రామచంద్రపురంలో ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేసినట్టు చినబాబు వివరించారు. విశాఖ, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 32 కేటగిరీల భవన నిర్మాణ కార్మికులు ఈ సభలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న సభకు కార్మికులంతా తరలి వచ్చి విజయవంతం చెయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో శ్రీకళా కార్పెంటర్స్, భీమేశ్వరా తాపీ వర్కర్స్, భీమేశ్వరా ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘాలతో పాటు వివిధ భవన నిర్మాణ కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ 32వ వార్షికోత్సవం

పి.గన్నవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 32వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన తానేలంక వెంకటరమణ-భార్గవి దంపతులు కలశ స్థాపన చేసి శ్రీరామనామసంకీర్తన యజ్ఞాన్ని ప్రారంభించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూర, నాగవల్లిదళ పుష్పార్చనలు జరిపించారు. వెంకటరమణ-భార్గవి కుమారుడికి రూ.1.02 లక్షలను తులాభారంగా స్వామివారికి సమర్పించారు. వచ్చేనెల 6వ తేదీ వరకు ఆలయ ప్రధానార్చకులు ఏజేవీఎస్ శర్మ, ఎస్.సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రతిరోజూ అభిషేకాలు, సహస్ర కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



చిన్నారికి తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాలలను తనిఖీ చేసిన డీవైఈవో

అంతర్వేది, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను డీవైఈవో జి.సూర్యప్రకాష్ గురువారం సందర్శించారు. అంతర్వేదితో పాటు పలు పాఠశాలల్లో రికార్డులను తనిఖీచేసి విద్యార్థులను సామర్థ్యాలపై ప్రశ్నలు అడిగారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం జిల్లా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గెజిటెడ్ హెచ్ఎం సూర్యకుమారి, ప్రసాద్, బ్రహ్మాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళా మృతులకు నివాళి

అమలాపురం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన భక్తులకు నివాళులర్పిస్తూ గురువారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కోశాధికారి పడాల నాయుడు, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు గోకరకొండ నాగేంద్ర, గవర్నర్ నప్పా నాగేశ్వరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, గోటేటి గంగాధరం, తాళాబత్తుల చినబాబు, కుడుపూడి త్రినాథ్, పట్నాల రమణ, వలవల రెడ్డి నాయుడు, పసుమర్తి గోపాలకృష్ణ, నూకల సత్యనారాయణ, రాచకొండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు రహిత సమాజానికి కృషి చేయాలి'

మామిడికుదురు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు కోరారు. మహాత్మాగాంధీ వర్ధంతిని జాతీయ కుష్ఠు నిర్మూలనా దినోత్సవంగా జరుపుకుంటున్నామని హెల్త్ అసిస్టెంట్ యేడిద కవీంద్ర తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చెరుకూరి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, ఏఎన్ఎం కస్తూరి పాల్గొన్నారు.





అమలాపురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



రాజోలులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మహనీయుడు మహాత్మా గాంధీ

రాజోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సత్యం, అహింసాయుత మార్గంలో జీవించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. జాతిపిత వర్ధంతి సందర్భంగా రాజోలు గాంధీబొమ్మ సెంటర్లో వున్న గాంధీజీ విగ్రహానికి గురువారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసమే గాంధీజీ జీవితాన్ని వెచ్చించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, బూత్ కమిటీల కో-ఆర్డినేటర్ చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, మటపర్తి లక్ష్మి, అడబాల విజయ్, పామర్తి రమణ, కాట్నరాజు, యాలంగి రమేష్, బోళ్ల రాజేష్, రావి మురళీ, నార్కెడుమిల్లి విష్ణు, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణ, దేవళ్ల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లోని మహాత్ముని విగ్రహానికి పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతినబూనారు. పచ్చిగోళ్ల జనార్దనరావు కల్యాణ మండపంలో వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, వంకాయల కాశీ, వరదా సూరిబాబు, యర్రమిల్లి సత్తిబాబు, కాళ్లకూరి కుమార్ పాల్గొన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. క్లబ్‌ల అధ్యక్షులు బోనం సత్యవరప్రసాద్, యర్రమిల్లి అనంతలక్ష్మి, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు గోకరకొండ నాగేంద్రరావు, వలవల నాయుడు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి లక్ష్మి, గోటేటి గంగాధరరావు, కంకటాల విజయలక్ష్మి, పచ్చిగోళ్ల సత్యకుమారి, తేతల సత్యనారాయణరెడ్డి, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కుడుపూడి త్రినాథ్, భమిడిపాటి కనకాద్రిశాస్త్రి, పడాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లంక తల్లెమ్మ ఆలయంవద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రాజ్యాంగ పరిరక్షణ కోసం గోడ పత్రికను ఆవిష్కరించారు. జైబాపూజీ, జైభీమ్, జైసంవిధాన్ నినాదాలు చేశారు. పెన్మెత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పి.ఉదయభాస్కర వర్మ, గుబ్బల రవి, పి.బాబ్జీ పాల్గొన్నారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత గాంధీ విగ్రహానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న జాతిపిత విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు నివాళులర్పించారు. అంబాజీపేట, తొండవరం హైస్కూళ్లలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కుసుమ వెంకటేష్, ఉందుర్తి నాగబాబు, గ్రంధి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): అల్లవరం గంటాలమ్మ గుడి వద్ద గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు గమిడి సూరిబాబు, గౌరవాధ్యక్షుడు వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, బలభద్ర కోటయ్య, బలభద్ర రవి, వెదుళ్లపల్లి శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరగిరిపట్నంలో జరిగిన గాంధీ వర్ధంతిలో ఆర్యవైశ్య నాయకులు ఉద్దగిరి బాబి, మన్యం సూరిబాబు, మోటమర్రి వెంకటరమణ, జనసేన నాయకులు నల్లా రాము, కటికిరెడ్డి బాబి పాల్గొన్నారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేపల్లిలో గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులు పెంటపాటి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, నూలు మురళీకృష్ణ, శీరం గోపాలకృష్ణ, నూలు నానాజీ, శీరం శ్రీనివాసరావు, శీరం సత్యనారాయణ, బాబి తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో....



పి.గన్నవరం మండలం మానేపల్లిలో...



పూజలు నిర్వహిస్తున్న పండితులు

మహా సౌర యాగం

ఉప్పలగుప్తం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో నెల రోజుల పాటు నిర్వహించే నక్షత్ర నవగ్రహపూర్వక మహా సౌరయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మున్నంగి రామకృష్ణశర్మ సారధ్యంలో పలువురు పండితులు యాగ సంకల్పాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, చండీ హోమం నిర్వహించారు. రాజశ్యామల ఆరాధన జరిగింది. ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుని ఆరాధనతో ఆరోగ్య, ఐశ్వర్యాలు లభిస్తాయని యాగకర్త తెలిపారు. ప్రారంభ పూజల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవం

అంతర్వేది, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలల సంరక్షణలో భాగంగా పది రోజుల కార్యక్రమాన్ని ఏపీ ఎన్జీసీ స్టేట్ మోనిటరింగ్ అధికారి గుండేపల్లి ప్రభావతి గురువారం సఖినేటిపల్లిలంక నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవరాశుల్లో 70 శాతం చిత్తడి నేలల్లోనే అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

లారీ ఢీకొని మోటారు సైకిస్టుకు
తీవ్ర గాయాలు

అంబాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లారీ వెనుక వెళ్తున్న సమయంలో బలంగా ఢీకొట్టడంతో మోటారు సైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన వీఆర్‌ఏ బీర పెద సత్యనారాయణ ఈ నెల 29న మోటారు సైకిలుపై అంబాజీపేట నుంచి ఇంటికి బయల్దేరాడు. మాచవరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. వీఆర్‌ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు.

గెద్దనపల్లిలో రోడ్డు ప్రమాదం

కాట్రేనికోన, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గెద్దనపల్లిలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కాట్రేనికోన నుంచి పల్లంకుర్రు వైపు వెళ్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. గాజింగితిప్పకు చెందిన గరగ నాగు గాయపడ్డాడు.



బొటానికల్ గార్డెన్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఏ మునిస్వామి, అధికారులు

జాతిపితకు నివాళి

యానాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ పార్కు, బొటానికల్ గార్డెన్, ఫెర్రీ రోడ్డులో గల మహాత్మా గాంధీ విగ్రహాలకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనరు ఖండవల్లి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు, యానాం సమాచార శాఖ అధికారి కేఎల్వీ ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయలో గాంధీజీ విగ్రహానికి సిబ్బంది పూలమాలలు వేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించి మహాత్ముని సేవలను స్మరించుకున్నారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఎస్పీ బూత్ కమిటీలను తక్షణం ఏర్పాటు చేయాలి'

అమలాపురం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి నాటికి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోను పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేన పేర్కొన్నారు. ఎర్రవంతెన వద్దనున్న బీఎస్పీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 15నాటికి నియోజకవర్గ, సెక్టార్, బూత్ కమిటీలను నియమించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ, కార్యనిర్వాహక కార్యదర్శి కోలా త్రిమూర్తులు, యాళ్ల దొరబాబు, నియోజవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి జేవీఎస్ రాజు, బుడితి దయామహేష్, బండి శ్రీను, ఇసుకపట్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): బీఎస్పీని మరింత బలోపేతం చేసేందుకు కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేన పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోలా త్రిమూర్తులు అధ్యక్షతన ముమ్మిడివరం నియోజకవర్గ సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చిత్రసేన మాట్లాడుతూ నియోజకవర్గ, మండల, సెక్టార్, బూత్ కమిటీల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీభవానీ, బడుగు భీమేశ్వరరావు, కుసుమ శ్రీను, కమిడి శ్రీను, బండి మరిడేష్, పరమటవెంకటశ్రీను, విప్పర్తి శ్రీను, పోలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ చిత్రసేన

బాలిక అపహరణ కేసులో
యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

మామిడికుదురు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అపహరించిన కేసులో ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ తెలిపారు. పదో తరగతి చదువుతున్న 14 సంవత్సరాల బాలిక అదృశ్యంపై ఈ నెల 19న కేసు నమోదు చేశారు. ఆచూకీ కనుగొని ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా గోగన్నమఠానికి చెందిన పెసింగి సురేష్‌పై కిడ్నాప్, అత్యాచారంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సహాయ కమిషనరు సత్యనారాయణ

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామికి
కలెక్టర్ పూజలు

అంతర్వేది, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించి వేద పండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సహాయ కమిషనరు సత్యనారాయణ అందించారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి కల్యాణ మండపం, రథం, పార్కింగ్, క్యూలైన్లు, కొత్తగా ఏర్పాటుచేసిన కోనేరు తీర్థ మహోత్సవ ప్రదేశాలను పరిశీలించారు.



లూటుకుర్రులో లక్ష పసుపు కొమ్ముల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష పసుపు కొమ్ముల పూజ

మామిడికుదురు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లూటుకుర్రులో గోకవరపు శ్రీరామకృష్ణ-వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో గరిస ధాన్యం, లక్షల పసుపుకొమ్ముల నోము గురువారం వైభవంగా జరిగింది. అర్చకుడు భాగవతుల శర్మ ఆధ్వర్యంలో పసుపు కొమ్ముల రాశిపై అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ముత్తయిదువులకు వాయినాలు అందించారు. వచ్చిన వారికి తులసి మొక్కలను వితరణ చేశారు.



మాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బాలబాలాజీ సన్నిధిలో
మాస కల్యాణం

మామిడికుదురు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో గురువారం స్వామివారి మాస కల్యాణాన్ని సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆశీర్వచనం ఇచ్చారు.



వేద కళాశాలలో రక్తదాన శిబిరం

రాజోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేయడాన్ని యువకులు అలవాటు చేసుకోవాలని తాటిపాక వేద డిగ్రీ కళాశాల కార్యదర్శి రవికుమార్ కోరారు. కళాశాల ప్రాంగణంలో గురువారం పాలకొల్లు వలంటరీ బ్లడ్ బ్యాంకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఎన్ఏ డైరెక్టర్ కంచి సూర్యనారాయణ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఐఎస్, జి.సోమేశ్వరరావు, ఏవో రామరాజు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం'

అమలాపురం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు దాచుకోవడం, దోచుకోవడానికే అధిక ప్రాధాన్యమిచ్చారని అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ చైర్మన్ అల్లాడస్వామినాయుడు ఆరోపించారు. మాజీ సీఎం జగన్ ఇష్టారాజ్యంగా అప్పులుచేసి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. అమలాపురంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంరూ.10లక్షల కోట్లు అప్పులను మిగిల్చి అప్పగించిందన్నారు. అవన్నీ కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారాయని, ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి విమర్శలు పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించాలని వైసీపీకి హితవు పలికారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,11,922 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా స్వామివారి మాసకల్యాణం

ఆత్రేయపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి మాస కల్యాణాన్ని గురువారం ఘనంగా జరిపారు. ఆలయంలోని కల్యాణ వేదిక వద్దకు స్వామివారిని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారికి పట్టువస్త్రాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

డీఎస్పీ రఘువీర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కావద్దని డీఎస్పీ రఘువీర్ అన్నారు. గురువారం రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం-నష్టాలు అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తదనంతరం నేరాలకు పాల్పడుతున్నారని దీనివల్ల భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట నారాయణ సైబర్ నేరాల వల్ల నష్టాలు, ఆన్‌లైన్ గేమ్స్ యాప్‌ల వల్ల ఆర్థిక నష్టాలు తెలిపారు. ఎస్ఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువత కారణంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎస్ అలీఅన్సారీ, విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఈసీడీ అభిరామ్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.రాంబాబు, వెంకటదుర్గ, బి.కృష్ణవేణి, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు



సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న డీవైఈవో, ఎంఈవో తదితరులు

రాయవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయవరం సాయితేజా స్కూల్‌లో విద్యార్థులు గురువారం ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ కర్రి భానురేఖా, సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఉపకరిస్తాయన్నారు. పాఠశాలకు చెందిన 700 మంది విద్యార్థులు బయో డైవర్సిటీ, పవర్ హబ్, మానవ పరిణామ క్రమం తదితర 350కి పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనలను ఇన్‌చార్జ్ డీవైఈవో పి.రామ లక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, ఎస్ఐ డి.సురేష్‌బాబు, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు తదితరులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పడాల కమలారెడ్డి, వెలగల ఫణికృష్ణారెడ్డి, వైద్యులు జి.గోపి రవితేజా, ప్రత్యూష, వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎం.అమ్మిరెడ్డి, పోలిమాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో భావనారుషి, భద్రవతి అమ్మవార్ల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రెండో రోజు కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠ పూజలు

రాయవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గోపడుతోటలో భావనారుషి సమేత భద్రావతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు రెండవ రోజు గురువారం కూడా కొనసాగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఖానస పండితుడు పెదపూడి రఘురాం బృందం పాల్గొని పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసనం, ఆదివాస హోమం తదితర పూజలు చేశారు. అనంతరం భద్రావతి సమేత భావనారుషి స్వామివారి విగ్రహాలను, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

ఆత్రేయపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి, ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోర్ వికాసంపై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్స్ గ్రామస్థాయి కమిటీలకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

కె.గంగవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మసకపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పోలియో సోకిన కాలుకు గాయంకాగా అపరేషన్ చేశారు. గురువారం సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆపరేషన్‌కు సాయం అందించానని, దాతలు వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

సైబర్ క్రైంపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ దారం సురేష్ అన్నారు. మండపేట-ఆలమూరు రోడ్డులో వున్న ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలో గురువారం జరిగిన విద్యార్థుల సమావేశానికి కరస్పాండెంట్ కేవీ రాజు అధ్యక్షత వహించారు. దీనికి పట్టణ సీఐ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. విద్యార్థులకు సైబర్ క్రైమ్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద రహదారిలోనే ప్రయాణాలు

• ఇరువైపులా పిచ్చి మొక్కలతో బిక్కుమంటున్న వాహనదారులు • చోద్యం చూస్తున్న యంత్రాంగం

రావులపాలెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పుంత రోడ్లు, కాలువగట్టు రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్లతోపాటు, పిచ్చిమొక్కలతో మూసుకుపోయాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. ముఖ్యంగా రైతులు పొలం పనులు ముగించుకుని రాత్రి సమయాల్లో ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. తుప్పలు, పిచ్చిమొక్కల కారణంగా విష సర్పాలు రోడ్డుపైకి వచ్చేస్తూ వాహనదారులు, రైతులను తీవ్ర భయకంపితులను చేస్తున్నాయి. రావులపాలెం మండలంలోని కాలువగట్టు, పుంత రోడ్లకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, ముళ్లచెట్ల కారణంగా ఇరువైపులా మూసుకుపోయాయి. రావులపాలెం అరటి మార్కెట్ యార్డు నుంచి వెదిరేశ్వరం మీదుగా కొత్తపేట వెళ్లే కాలువగట్టు రోడ్డు వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గోపాలపురం జాతీయ రహదారి నుంచి ఈతకోట-గంటి రోడ్డుకు వెళ్లే ముమ్మిడివరప్పాడు పంటకాలువ గట్టు వైపు రాకపోకలు సాగించేందుకు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. రావులపాడు వంతెన వద్ద నుంచి ర్యాలీ వైపు వెళ్లే కాలువగట్టు రోడ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రోడ్లు ఏటిగట్లు సైతం రహదారికి ఇరువైపులా చెట్లు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేందుకు రైతులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించి వాహనదారులకు, రైతులకు రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



తుప్పలతో మూసుకుపోయిన రావులపాలెం అరటి మార్కెట్ యార్డు నుంచి వెదిరేశ్వరం వైపు వెళ్లే కాలువగట్టు

మహాత్మాగాంధీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

• వర్ధంతి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు • పూలమాలలు వేసి ఘన నివాళి

రావులపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. రావులపాలెం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, ఎం.ఆనందరావు, యర్రంశెట్టి బుజ్జి, దొడ్డం త్రినాథరావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ వర్ధంతిని కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీకట్ల గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కూటమి నాయకులు రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో గాంధీ మహాత్ముడికి నివాళులర్పించారు. వేగాయమ్మపేట సచివాలయంలో గాంధీ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి ఆచార్యులు, సచివాలయ సిబ్బంది మహాత్మాగాంధీకి నివాళులర్పించారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ అనుసరించిన అహింసావాదాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు అన్నారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక విద్యా బాలమందిర్‌లో గాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎన్.శివరత్నం, కరస్పాండెంట్ అనురాధ నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే బండారు

మండపేట (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీ జీవితం నేటి తరాలకు ఆదర్శమని వక్తలన్నారు. మండపేటతో పాటు మండలంలో గురు వారం గాంధీ వర్ధంతిని జరిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టీవీ రంగా రావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్య నారాయణ మూర్తి, కార్యాలయ సిబ్బంది, తహశీల్దార్, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. మండపేటలోని గాంధీ నగర్, ద్వారపూడి, ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ద్వారపూడిలో పంచాయతీ కార్యదర్శి ఆకులు వీవీ రమణ, ఇప్పనపాడులో కార్యదర్శి సుబ్బారావు, ఈవో పీఆర్‌డీ దాసరి శ్రీను తదితరులు గాంధీకి నివాళుర్పించారు.



వద్దిపర్రు ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఇసుక ర్యాంపు పరిశీలన

ఆత్రేయపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపర్రు ఇసుక ర్యాంపును ఆర్డీవో పి.శ్రీకర్, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ శంకరరావు, మైనింగ్స్ ఏడీ వంశీధర్‌రెడ్డి ర్యాంపులో స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. గోదావరిలో ఇసుక తవ్వకాలు ఏ మేరకు జరిపారో వారు పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు రాజేశ్వరరావు అధ్యక్షతన సిబ్బందితో ఆర్డీవో సమావేశమయ్యారు. వాడపల్లిలో రీసర్వేపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

సమస్యలపై ఎంపీ హరీష్‌కు వినతిపత్రం



అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై అమలాపురం ఎంపీ జీ.హరీష్‌మాధుర్‌ను కూటమినేతలు కలిశారు. టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి నేతృత్వంలో గురువారం అమలాపురంలో కలిసి వారు వినతి పత్రం ఇచ్చారు. వాటి వివరాలను వారు పత్రికలకు విడుదల చేశారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ సమస్యలను వివరించ టంతోపాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను స్టేషన్ లో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేశవరం, జెడ్.మేడపాడు పై ఓవర్ వంతెన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడి సమస్యలను రైల్వేశాఖ దృష్టికి తీసుకు వెళతానని చెప్పారన్నారు. గ్రామంలో రుద్రభూమిలో మౌలిక వసతులు కల్పించాలని గ్రామంలో పార్కు ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం ఎంపీని వారు సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు సత్తి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎం.వీరభద్రరావు, తాణింకి చంద్రశేఖర్, కె.మురళీకృష్ణ తదితరులు వున్నారు.



అంగరలో ప్రత్యేక అలంకరణలో వైభవ వెంకటేశ్వరస్వామివారు

వైభవంగా వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంగరలో ఉన్న అలివేలుమంగ గోదాదేవి సమేత వైభవ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశపూజ తదితర పలు పూజలను జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో వివిధ గ్రామాల భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రావులపాలెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సెయింట్ పెట్రిక్స్ పాఠశాలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరై రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ ఆర్.షణ్ముఖ్, అరుణ్, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.



ఇటుకబట్టీ కార్మికులతో మాట్లాడుతున్న కార్మికశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు

కార్మిక చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాలి

ఆలమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కార్మికులు పనిచేస్తున్న ఆయా ప్రాంతాలను బట్టి అమలులో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మికశాఖ మండపేట అధికారి కాశీ నాగమల్లేశ్వరరావు అన్నారు. రిజిష్టర్లు, రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఆలమూరులో గురువారం ఇటుకబట్టీలను పరిశీలించిన అనంతరం కార్మికులతో మాట్లాడారు. కార్మికులు రూ.100 కార్మిక సంక్షేమ నిధికి చెల్లించాలని కోరారు. ప్రాంతాల వారీగా వేతన చట్టాలు అమలు చేయాలని యజమానులకు ఆయన సూచించారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శలు

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం పరామర్శించారు. మండపేటకు చెందిన కోడూరి లక్ష్మి, రిమ్మలపూడి తులసి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మండపేట మండలం పాలతోడుకు చెందిన ఉప్పులూరి సోమరాజు, అప్పసారి లక్ష్మీకాంతం, వై.సీతానగరానికి చెందిన నంబూరి సూర్యకాంతం, ఏడిదకు చెందిన హరిదాసుల లక్ష్మీప్రియ, అవ్వారు వీర వెంకట సత్యనారాయణ మూర్తి, యారమాటి సంఘరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన గుణ్ణం పద్మావతి, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.



మండపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

మండపేట, జనవరి, 30(ఆంధ్రజ్యోతి) మండపేటలోని ఫాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ డేనియెల్ పాల్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రైస్తవ మహాసభలకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల సమస్యలను పరిష్కరించటంలో ముందుంటానన్నారు. డేనియెల్‌పాల్ కార్యక్రమాలను పలువురు కొనియాడారు. సభలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్‌బాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగలను డేనియెల్ పాల్ సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో దూళి జయరాజు మాదిగ, ఉండ్రాజవరపు అర్జున్ మాదిగ, గాలింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పశు ఆరోగ్య శిబిరాలు

కపిలేశ్వరపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో 21న ప్రారంభమైన పశుఆరోగ్య శిబిరాలు గురువారంతో ముగిశాయి. మండలంలోని కాలేరులో ఆఖరిరోజు గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ వీవీ రమణమూర్తి, పలువురు పాడి రైతులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సెక్షన్ పరిధిలోని గ్రామాలకు నేడు విద్యుత్ నిర్వహణలో భాగంగా కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు తెలిపారు. ఆలమూరు సెక్షన్ పరిధిలోని ఆలమూరు, గుమ్మిలేరు, నర్సిపూడి, పినపళ్ల, చింతలూరు, పెదపళ్ల, నవాబుపేట, పెనికేరు, సూర్యారావుపేట, సంధిపూడి, కలవచర్ల గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు పలు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లో పలు మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో 11కేవీఏ ఫీడర్ మెయింటనెన్స్ పనుల కారణంగా బిక్కవోలు మండలం కొమరిపాలెం, రాయవరం మండలం పరిధిలో రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, లొల్ల, అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి, పడమరఖండ్రిక గ్రామాల్లో కపిలేశ్వరపురం 11కెవీ ఫీడరుపై, అంగరలో విద్యుత్ లైన్లపై చెట్టు కొమ్మలు తొలగించడం, లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.



మోదుకూరు గ్రామదేవత ఊడుగులమ్మ

ఘనంగా ఊడుగులమ్మ తీర్థం

ఆలమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మోదుకూరు గ్రామదేవత ఊడుగులమ్మ అమ్మవారి మహోత్సవం గురువారం జరిగింది. బుధవారం రాత్రి అమ్మవారి జాతరను ఘనంగా జరిపారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవం సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ఆలమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న పలు పంచాయతీలకు నూతన కార్యదర్శులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బడుగువాని లంక గ్రామానికి సీహెచ్‌వీ వెంకటరెడ్డి, జొన్నాడకు సీహెచ్ సుభాష్, చింతలూరుకు ఎ.వీరన్నచౌదరి, నర్సిపూడికి దేవిశ్రీ, నబరి ఆంద్ర, గుమ్మిలేరుకి ఎన్.శ్రీలలిత, చెముడులంక పంచాయతీ కార్యదర్శిగా సీహెచ్ నవీన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కోటిపల్లి రేవులో జల్లు స్నానఘట్టాన్ని పరిశీలిస్తున్న వాసంశెట్టి సత్యం

శివరాత్రినాటికి జల్లు స్నానఘట్టం సిద్ధం చేయాలి

కె.గంగవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రానున్న శివరాత్రి నాటికి కోటిపల్లి రేవులో జల్లు స్నానఘట్టాన్ని సిద్ధం చేయాలని కార్మిక శాఖ మంత్రి సుభాష్ తండ్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం ఆయన కోటిపల్లి రేవులో సుభాష్ సేవా సమితి సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, సుభాష్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

రాయవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయవరం మెయిన్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఇన్‌ఛార్జ్ డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరుశాతాన్ని హెచ్‌ఎం లచ్చిరెడ్డి వెంకట రమణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌ఛార్జ్ డీవైఈవోను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, నెంబర్‌వన్ స్కూల్ హెచ్‌ఎం జి.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.